క్లుప్తంగా

1001 బిందెలతో జలాభిషేకం



ఉండవెల్లి: మండల కేంద్రంలోని మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలో శ్రావణ సోమవారం సందర్భంగా వర్షాలు సమృద్ధిగా కురవాలంటూ 1001 బిందెలతో రామలింగేశ్వరస్వామి ఆలయంలో జలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త దామోదర్‌రెడ్డి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

కళాశాలలో రక్షాబంధన్ వేడుకలు



అలంపూర్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏబీవీపీ ఆధ్వర్యంలో సోమవారం రక్షాబంధన్ వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నువ్వు నాకు రక్ష నేను నీకు రక్ష మనందరం దేశానికి రక్ష నినాదాంతో రాఖీలు కట్టారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్ఎఫ్‌డీ కోకన్వీనర్ వెంకటేష్, కళాశాల అధ్యక్షుడు జశ్వంత్, సోషల్ మీడియా కన్వీనర్ పవన్, హాస్టల్ కన్వీనర్ శ్రీకాంత్, ప్రశాంత్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాల పరిశీలన



ధరూరు: మండల పరిధిలోని సోంపురం, పారుచర్ల గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను ఎంఈఓ రవీంద్రబాబు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు, హాజరు రిజిస్టర్లలను పరిశీలించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు. మెరుగైన విద్యతో పాటు నాణ్యమైన భోజనం వడ్డించాలని ఏజెన్సీ సభ్యులకు సూచించారు. ముఖ్యంగా ఎఫ్ఆర్ఎస్ 100 శాతం పూర్తి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల అనుమతులు రద్దు చేయాలి



అయిజ: నిబంధనలు ఉల్లంఘిస్తున్న ప్రైవేటు పాఠశాలల అనుమతులు రద్దు చేయాలని బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య అన్నారు. సోమవారం ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈఓ రాములుకు ఫిర్యాదు చేశారు. శ్రీ చైతన్య, న్యూ గీతాంతాంజలి పాఠశాలలు అనుమతులు ఒకచోట తీసుకొని మరొక ప్రదేశంలో పాఠశాలలను నిర్వహిస్తున్నారని ఆరోపించారు. విద్యాహక్కు చట్టానికి విరుద్ధం స్థలం అనుమతులు ఒకచోట, బిల్డింగ్ అనుమతులు వేరొకచోట తీసుకొని అధికారులను తప్పుదోవ పట్టించి చాలా సంవత్సరాల నుంచి పాఠశాలలను నిర్వహిస్తున్నారన్నారు. పాఠశాలల్లో ఫైర్‌సేఫ్టీ లేదని, ప్లేగ్రౌండ్ కూడా ఏర్పాటు చేయలేదని పేర్కొన్నారు. తక్షణమే ఆయా పాఠశాలల అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

మహాసభలను జయప్రదం చేయాలి



ఆత్మకూర్: నిరంతరం ప్రజల పక్షాన పోరాటాలు చేస్తూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు అన్నారు. సోమవారం స్థానిక అతిథి గృహంలో సీపీఐ మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ నెల 19, 20, 21, 22వ తేదీల్లో మల్కాజ్‌గిరిలో మహాసభలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు శ్రీహరి, మోష, లింగన్న, ఆంజనేయులు, ఖాజాపీర్ తదితరులు పాల్గొన్నారు.

లంచం ఇచ్చే విధుల్లోకి వచ్చా

- ఇప్పుడు సస్పెండ్ చేస్తే మళ్లీ వస్తా
- ఉపాధ్యాయుడి తీరుతో గ్రామస్తుల విస్మయం
- పాఠశాలలోనే మద్యం తాగుతూ విద్యార్థులతో దుర్భాష
- రాజోళి మండలం చిన్నధన్వాడలో ఘటన

రాజోళి: 'మీ ఇష్టం వచ్చింది చేసుకోండి.. గతంలో లంచం ఇచ్చే విధుల్లోకి వచ్చా.. మళ్లీ సస్పెండ్ చేస్తే.. లంచం ఇచ్చే విధుల్లోకి వస్తా' అని ఓ ఉపాధ్యాయుడు సంచలన వ్యాఖ్యలు చేశారు. మద్యం తాగి వచ్చిన ఉపాధ్యాయుడిని గ్రామస్తులు నిలదీయడంతో పైవిధంగా స్పందించిన తీరుతో గ్రామస్తులు అవాక్కైన సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా రాజోళి మండలంలోని చిన్నధన్వాడలో చోటుచేసుకుంది. చిన్నధన్వాడ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు రవిచందర్ గత ఐదేళ్లుగా ఎస్‌జీటీగా పనిచేస్తున్నాడు. సోమవారం సదరు ఉపాధ్యాయుడు మద్యం మత్తులో చేసిన రచ్చతో విద్యార్థులు విసిగిపోయి గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. కొందరు అక్కడికి వెళ్లగా వారిపై చెప్పలేని బూతులతో విరుచుకుపడ్డాడు. మద్యం తాగి బడికి రావడం, పిల్లలతో దురుసుగా ప్రవర్తిస్తున్నాడు. గ్రామస్తులు ఎన్నోసార్లు చెప్పినా తీరు మార్చుకోకపోగా.. నా వెనక మా కుల, ప్రజా సంఘాలు ఉన్నాయని బెదిరించడం, దుర్భాషలాడటంతో గ్రామస్తులు తమ పిల్లలను ఇతర పాఠశాలలకు పంపుతున్నారు. గతంలో యూపీఎస్ పాఠశాలగా ఉన్న ఈ బడిలో 200 మంది దాకా విద్యార్థులు ఉండేవారని, సదరు మద్యం మాస్టారు తీరుతో 50 మందిలోపే విద్యార్థులు వస్తున్నారని, దీంతో పాఠశాల మనుగడకే ముప్పు ఏర్పడుతుందని స్వయంగా ఎంఈఓనే పేర్కొనడం విశేషం.

మితిమీరిన ఆగడాలు..

ఉదయం పాఠశాలకు రావడమే మందు తాగి వస్తాడని, వచ్చాక కూడా విద్యార్థులను పట్టించుకోకుండా ఒక గదిలోకి వెళ్లి మందు తాగడం, తలుపులు మూసుకుని, దుస్తులు విప్పేసి అర్ధనగ్నంగా పడుకోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఎవరైనా వచ్చారని చెబితే.. కూల్‌డ్రింక్ బాటిల్‌లో మందు కలుపుకొని తాగుతూ.. ఊగుతూ.. బూతులు తిడుతూ బయటకు వస్తారని గ్రామస్తులు వాపోతున్నారు. గతంలో మద్యం తాగి పాఠశాలకు రాకపోగా.. విధులకు వచ్చినట్లు హాజరు వేసుకున్నాడు. అదే సమయంలో మండలంలో పర్యటించిన అదనపు కలెక్టర్ ఈ విషయం తెలుసుకుని ఆయనను సస్పెండ్ చేశారు. పనిష్మెంట్ డ్యూటీ ఇచ్చినప్పటికీ కొందరు అధికారుల అండతో ఇదే పాఠశాలలో కొనసాగుతున్నాడని గ్రామస్తులు ఆరోపించారు.



సోమవారం మద్యం మత్తులో చొక్కా విప్పి గదిలో తిరుగుతున్న ఉపాధ్యాయుడు రవిచందర్



మద్యం కలిపి తెచ్చుకున్న కూల్‌డ్రింక్ బాటిల్

సస్పెండ్ చేయాలి..



మా పిల్లల భవిష్యత్ ఈ మాస్టారు వల్ల నష్టపోతుందని అధికారులకు ఎన్నోసార్లు విన్నవించాం. అయినా ఆయన తీరు మారలేదు. సాక్ష్యాధారాలతో సహా అధికారులకు తెలిపినా చర్యలు తీసుకోకపోతే ఎలా. సోమవారం పాఠశాల దగ్గరకు వెళ్తే కూల్‌డ్రింక్ బాటిల్‌లో మందు పోసుకుని తాగుతున్నాడు. దుస్తులు విప్పేసి గది తలుపులు వేసుకుని పడుకున్నాడు. వెంటనే సస్పెండ్ చేయాలి.

– విక్రమ్‌రెడ్డి, చిన్నధన్వాడ

పిల్లల సంఖ్య తగ్గింది



ఆయన ఎప్పుడూ మందు తాగే ఉంటాడు. ఆయన బడికి రాకపోయినా హాజరు వేసుకుంటాడు. లేదంటే బడిలోనే తాగి పడుకుంటాడు. ఆయన తీరుతో వందల సంఖ్యలో ఉన్న పిల్లలు తగ్గిపోయి పదుల సంఖ్యకు చేరింది. ఎవరైనా అడిగితే వారితో గొడవ పడతాడు. తాగి ఇళ్ల దగ్గరకు వచ్చి గొడవ చేస్తాడు. మహిళలతోనూ వాగ్వాదానికి దిగుతాడు. అధికారులకు చెప్పినా చర్యలు తీసుకోవడం లేదు.

– పెద్దరాజు, చిన్నధన్వాడ

మమ్మల్నే తిడుతున్నాడు

గ్రామస్తులు చేసిన ఫిర్యాదుల మేరకు విచారణకు వెళ్తే సహకరించడు. గత మార్చిలో గ్రామస్తుల ఆధ్వర్యంలో విచారణ చేపట్టాం. తాగి పాఠశాలకు రావొద్దని చెప్పినందుకు మమ్మల్నే నానా బూతులు తిట్టాడు. ఇదే తీరుపై నివేదిక అధికారులకు పంపాను. సోమవారం జరిగిన సంఘటనపై నివేదిక పంపి ఉన్నతాధికారులకు కఠిన చర్యలు తీసుకోవాలని మరోసారి విన్నవిస్తాను.

– భగీరథరెడ్డి, ఎంఈఓ, రాజోళి మండలం

పెంచిన జీతాలు చెల్లించకుంటే ధర్నా

రాజోళి: మండల కేంద్రంలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు పెంచిన జీతాలు అమలు చేయకుంటే ధర్నా చేస్తామని సీపీఎం మండల కార్యదర్శి విజయ్‌కుమార్ హెచ్చరించారు. సోమవారం ఎంపీడీఓకు భాస్కర్‌కు కార్మికులతో కలిసి వినతిపత్రం అందచేశారు. గతంలో సర్పంచ్, వార్డు మెంబర్లు తీర్మానం చేసి రూ.2,200 జీతాన్ని పెంచారని, కొన్ని నెలలు కార్మికుల ఖాతాల్లో పడిన ఆ జీతాలు మళ్లీ ప్రస్తుతం ఇవ్వడం లేదని, కేవలం రూ.9,500 వస్తే కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలన్నారు. తొమ్మిది నెలలుగా పెంచిన జీతం అందడం లేదని వెంటనే వాటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రతిసారి అధికారుల దృష్టికి సమస్యను తీసుకొచ్చినా ఎలాంటి ప్రయోజనం ఉండటం లేదన్నారు. కాలయాపన జరుగుతుందే తప్పా కార్మికులకు న్యాయం జరగడం లేదన్నారు. జీతాలు అందకపోతే ప్రభుత్వ కార్యాలయాల ఎదుట పెద్ద ఎత్తున ధర్నాలు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు లక్ష్మన్న, కృష్ణ, రవి, తిక్కన్న, మహేష్, దస్తగిరి, సంజన్న తదిదరులు పాల్గొన్నారు.



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

హర్‌ఘర్ తిరంగా విజయవంతం చేయండి

ధరూరు: పంద్రాగస్టును పురస్కరించుకొని బీజేపీ నాయకులు ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని బీజేపీ నాయకురాలు డీకే స్నిగ్ధారెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ప్రతి కార్యకర్త విజయవంతం చేయాలని సూచించారు. ఆపరేషన్ సిందూర్ దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. యావత్ ప్రపంచమే భారత్ ధైర్య సాహసాలు, శక్తి సామర్థ్యాలు చూసి ఆశ్చర్యపోయిందన్నారు. ఆగస్టు 10 నుంచి 15 వరకు నిర్వహించే కార్యక్రమాలపై ప్రజల భాగస్వామ్యం పెద్దఎత్తున ఉండాలన్నారు. స్వాతంత్ర్య పోరాట స్మారక చిహ్నాలు, యుద్ధ స్మారక చిహ్నాలు, ముఖ్య ప్రదేశాలు, స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించి మహనీయులకు పూల మాలలు వేసే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. మాజీ సైనికులు, అమరవీరుల ఇళ్లకు వెళ్లి పరామర్శలు, సన్మానాలు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, రవికుమార్ ఎక్బోటే, వెంకట్రాములు, రమాదేవి, కిష్టన్న, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీకే స్నిగ్ధారెడ్డి

వైభవంగా మధ్యారాధన ఉత్సవాలు

గద్వాలటౌన్: జిల్లా కేంద్రంలో మంత్రాలయ రాఘవేంద్రస్వామి ఆరాధన ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. రెండో రోజు సోమవారం మధ్యారాధన ఉత్సవాలు చేపట్టారు. స్థానిక షెరెల్లి వీధిలోని రాఘవేంద్రస్వామి మఠంలో ఆలయ విచారణకర్త ప్రభాకర్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. భీంగనర్, రాజవీధిలోని రాఘవేంద్రస్వామి ఆలయంలో పండితులు ప్రత్యేక పూజలు చేశారు. రాఘవేంద్రస్వామి మూల బృందావనానికి మహా పంచామృతాభిషేకం చేశారు. మఠం చుట్టూ రథోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. రథోత్సవంలో శేషదాస భజన మండలి సభ్యులు భక్తి గీతాలు ఆలపిస్తూ ముందుకు సాగారు.

నేడు ఉత్తరారాధన..

ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఉత్తరారాధన మహోత్సవం నిర్వహించనున్నారు. మఠంలో స్వామి మూల బృందావనానికి మహా పంచామృతాభిషేకం నిర్వహిస్తారు. మఠం నుంచి కోటలోని చెన్నకేశవస్వామి ఆలయం వరకు రథోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



విశేష అలంకరణలో బృందావనం

గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన

ఉండవెల్లి: మండలంలోని బొంకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో షీటీం ఇన్‌చార్జ్ తేజశ్విని ఆధ్వర్యంలో మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అసభ్యకర ప్రవర్తన, గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై వివరించారు. వేధింపులకు గురైనపుడు 100, 1930కి సమాచరం అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మద్దిలేటి, శేషన్న, లోకేశ్వరి, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.



రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి



చింతలకుంటలో రైతుబీమాపై అవగాహన కల్పిస్తున్న ఏఈఓ భరత్‌సింహ

మల్దకల్: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన రైతులు రైతుబీమా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి రాజశేఖర్ సూచించారు. సోమవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో కొత్తగా పాస్‌బుక్‌లు పొందిన రైతుల నుంచి రైతు బీమా దరఖాస్తులు స్వీకరించినట్లు ఆయన తెలిపారు. అదే విధంగా రైతుబీమా చేసుకునే ప్రతి రైతు తమ నామినీ పేరు తప్పనిసరిగా నమోదు చేయించాలని పేర్కొన్నారు. రైతుబీమా దరఖాస్తు చేసుకునే రైతులు ఆధార్, పాస్‌బుక్ జిరాక్స్, నామినీ ఆధార్ జిరాక్సుతో వ్యవసాయ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు రాహుల్‌పైలెట్, ఖాజాపాష, కిషోర్, భాస్కర్ రైతులు పాల్గొన్నారు.

బీమాపై అవగాహన

కేటీదొడ్డి: నూతనంగా పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన రైతులు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని ఏఈఓ భరత్‌సింహ అన్నారు. సోమవారం మండల పరిధిలోని చింతలకుంట రైతువేదికలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆగస్టు 13లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుకు 18 నుంచి 59 ఏళ్లలోపు ఉండాలని 1966 ఆగస్టు 14 నుంచి 2007 ఆగస్టు 14 మధ్యలో పుట్టిన వారై ఉండాలని పేర్కొన్నారు.

నామినీ పేర్ల నమోదు

అయిజ: మండలంలోని వివిధ గ్రామాల్లో ఏఈఓలు రైతు బీమాకు అర్హులైన రైతుల పేర్లను నామినీగా నమోదు చేశారు. రైతుబీమాకు నామినీ రిజిస్ట్రేషన్ చేసుకొని ఉండి, అభ్యతరాలుంటే మార్చుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

బీచుపల్లిలో అభిషేకాలు

ఎర్రవల్లి: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని శివాలయంలో శ్రావణమాసం మూడో సోమవారం సందర్భంగా పరమశివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో బీచుపల్లికి చేరుకొని కృష్ణానదిలో స్నానాలాచరించి పరమశివుడిని దర్శించుకొన్నారు. అనంతరం మొక్కులు తీర్చుకున్నారు.



ప్రైవేటీకరణ ప్రయత్నాలు నిలిపివేయాలి

గద్వాలన్యూటౌన్: కేంద్ర ప్రభుత్వం ఐడీబీఐ బ్యాంక్‌ను ప్రైవేట్‌పరం చేయాలని శతవిధాల ప్రయత్నిస్తోందని, ప్రైవేటీకరణ ప్రయత్నాలు నిలిపివేయాలని ఐసీఈయూ బ్రాంచ్ ప్రధాన కార్యదర్శి బంగి రంగారావు డిమాండ్ చేశారు. సోమవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ఎల్ఐసీ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఐడీబీఐ బ్యాంకులో కేంద్రం 45.48 శాతం వాటాలను తమ వద్ద ఉంచుకొని, 49.24శాతం వాటాలను గతంలోనే ఎల్ఐసీ చేత కొనిపించిందన్నారు. దీని వల్ల ఐడీబీఐ బ్యాంక్ ప్రభుత్వరంగ బ్యాంక్ హోదాను కోల్పోవడమే కాకుండా ఎల్ఐసీకి కూడా సొంతం కాలేదన్నారు. ఇప్పుడు ప్రభుత్వం, ఎల్ఐసీ దగ్గర ఉన్న మొత్తం వాటల్లో దాదాపు 60 శాతం తగ్గించేందుకు కేంద్రం రంగం సిద్ధం చేసిందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా తన ప్రయత్నాలు విరమించుకోవాలని డిమాండ్ చేశారుర. కార్యక్రమంలో రాఘవేంద్ర, మల్లికార్జున్, నర్సింగ్, శశాంక్, శివశంకర్, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగులను నిర్మూలిద్దాం



అలంపూర్‌లో ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న మండల వైద్య విస్తరణ అధికారి సత్యనారాయణ

సాక్షి నెట్‌వర్క్: నులిపురుగులను నిర్మూలిద్దామని వైద్యాధికారి భరత్, మండల వైద్య విస్తరణ అధికారి సత్యనారయణ అన్నారు. అలంపూర్ మండలంలోని జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఎంఈఓ అశోక్‌కుమార్, మండల వైద్య విస్తరణ అధికారి మద్దిలేటి నులిపురుగు నిర్మూలనకు ఆల్బెంజోల్ మాత్రలు పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కేజీవీబీలు, అంగన్‌వాడీ పాఠశాలల్లోని విద్యార్థులకు అల్బెండజోల్ అందజేశారు. దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న వారికి ఈ నెల 18న ఆల్బెంజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఇందిర, హెల్త్ అసిస్టెంట్స్ బాలీశ్వరయ్యశెట్టి తదితరులు పాల్గొన్నారు.

❋ మానవపాడు మండల కేంద్రంలోని కేజీబీవీలో తహసీల్దార్ జోషి శ్రీనివాస్‌శర్మ, డాక్టర్ హేమమానస ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. పాఠశాలలో, కేజీబీవీ, అంగన్‌వాడీ సెంటర్లలో మొత్తం మండల వ్యాప్తంగా 9,748 మందికి ఆల్బెండజోల్ మాత్రలు ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఓ జ్యోతి, సూపర్‌వైజర్ చంద్రన్న, అక్కమ్మ, అబేదుళ్ల, ఏఎన్ఎం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

❋ అయిజ బాలుర ఉన్నత పాఠశాలలో పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ఆల్బెండజోల్ మాత్రలు యాంటీ హెల్మెంటిక్ ఔషధమని, వివిధ రకాల పరాన్నజీవులను చంపడం లేదా పెరుగుదలను అడ్డుకోవడం చేస్తుందని పేర్కొన్నారు.

❋ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా రాజోళి మండలంలోని మాన్‌దొడ్డి ప్రాథమిక పాఠశాలలో అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాజు, ఎంఎల్‌హెచ్‌పీ వెంకటేశ్వరి, ఉపాధ్యాయులు మధుసూదన్, మహేష్ పాల్గొన్నారు.

❋ జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు మాత్రల పంపిణీ చేసినట్లు ధరూరు మండల మెడికల్ అధికారి ఆయేసా బేగం తెలిపారు. మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో మండల మానిటరింగ్ అధికారి, ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సంధ్యా కిరణ్మయి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశారు. 1- 19 ఏళ్ల లోపు వారందరికీ ఆల్బెండజోల్ మాత్రలు ఉచితంగా వేస్తున్నామన్నారు. కేజీబీవీలో 250 మందికి పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ హీర్యా నాయక్, కేజీబీవీ స్పెషలాఫీసర్ గోమతి తదితరులు పాల్గొన్నారు.



ధరూరు కేజీబీవీలో..

❋ మల్దకల్ మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలు, కళాశాలల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేసినట్లు డాక్టర్ స్వరూపరాణి తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంఈఓ సురేష్, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీధర్, నాగేంద్రం, వెంకటస్వామి, సులోచన, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

❋ గట్టు మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు సోమవారం ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేసినట్లు డాక్టర్ సూర్యప్రకాష్ తెలిపారు. అదే విధంగా అంటు వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో మల్లమ్మ, వెంకటేష్, వెంకటాద్రినాయుడు, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

❋ కేటీదొడ్డి మండల పరిధిలోని నందిన్నె రాఘవేంద్ర పాఠాలలో నులి పురుగుల నివారణ మాత్రలు విద్యార్థులకు అందజేశారు.

❋ ఇటిక్యాల మండలంలోని ప్రభుత్వ, పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్లు వైద్యాధికారి డాక్టర్ రాధిక అన్నారు. మండల పరిధిలో దాదాపు 13 వేల మంది చిన్నారులకు మాత్రలను ఇచ్చినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ రాఘవేంద్ర, ఏఎన్ఎంలు, ఆశాలు అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.



మానవపాడు కేజీబీవీలో ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న అధికారులు



ఇటిక్యాలలో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న వైద్యాధికారి రాధిక



మల్దకల్ హైస్కూల్‌లో ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న వైద్య సిబ్బంది

భారీ వర్షం.. రోడ్లు జలమయం



ఉండవెల్లిలో ఉధృతంగా పారుతున్న అనుసూయమ్మకాలనీ వాగు

ఉండవెల్లి: మండలంలో 73.2 శాతం వర్షపాతం నమోదైంది. సోమవారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి మండల కేంద్రంలో అనుసూయమ్మ కాలనీలో వాగు ఉధృతంగా ప్రవహించడంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చిన్నఆముదాలపాడు– ఉండవెల్లి, మారమునగాల–ప్రాగటూరు, బైరాపురం– బస్వాపురం, మెన్నిపాడులో వాగులు ఉధృతంగా ప్రవహించాయి. పంట పొలాల్లోకి నీరు చేరడంతో రైతులు నీటిని తొలగించేందుకు ఆపసోపాలు పడుతున్నారు. శ్రమించారు.

జలమయమైన రోడ్లు

అలంపూర్ రూరల్: అలంపూర్ మండల పరిధిలోని కాశీపురంలో రోడ్లు జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు చేరడంతో ప్రజలు నానా అవస్థలు పడ్డారు.

రాకపోకలకు అంతరాయం

మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొర్లి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ప్రధాన వాగులు పొంగిపొర్లడంతో పంట పొలాలు నీటిపాలైనట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.



కాశీపురం గ్రామంలో..



మానవపాడు- అమరవాయి మధ్య పారుతున్న వాగు